PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 299 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 23 అక్టోబర్ 2026

### జనాభా గణనకు క్షేత్రస్థాయిలో పటిష్ఠ ప్రణాళిక


3లో

### పేద విద్యార్థుల విద్యాప్రదాత ఎస్ఆర్ శంకరన్


3లో

## 2047 నాటికి వికసిత భారత్ నిర్మాణమే లక్ష్యం

- దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలి: వెంకయ్య నాయుడు



**హైదరాబాద్, అక్టోబర్ 22 (పీసీడబ్ల్యూ న్యూస్):** 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. దేశాభివృద్ధి అనేది ప్రభుత్వాలకే పరిమితం కాకుండా ప్రజలందరి సమష్టి కృషితో సాధ్యమవుతుందని

మిగతా2లో...

## కులగణనతో సామాజిక న్యాయం

- ముదిరాజ్‌లను బీసీ-ఏలో
- చేర్చే అంశంపై అధ్యయనం
- ట్యాంక్‌బండ్‌పై పండుగ సాయన్న, దొడ్డి
- కొమురయ్య విగ్రహాలు: సీఎం రేవంత్‌రెడ్డి


2లో



## రష్యా - ఉక్రెయిన్ యుద్ధం ముగియాలి: మోదీ

- పశ్చిమాసియాలోనూ శాంతి నెలకొనాలి.. పోలండ్‌తో కీలక ఒప్పంద దిశగా అడుగులు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 22 (పీసీడబ్ల్యూ న్యూస్):** రష్యాఉక్రెయిన్ యుద్ధం త్వరగా ముగియాలని, పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభానికి శాంతియుత పరిష్కారం లభించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. అంతర్జాతీయంగా శాంతిని నెలకొల్పేందుకు భారత్ అర్థవంతమైన ప్రయత్నాలకు మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. గురువారం న్యూఢిల్లీలో పోలండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో జరిగిన సమావేశం అనంతరం ఇరుదేశాల

మిగతా2లో...

## వరంగల్ కోట అభివృద్ధికి రూ.382 కోట్లు

- కాకతీయుల వైభవానికి కొత్త శోభ
- చారిత్రక కట్టడాల పరిరక్షణ, పర్యాటక అభివృద్ధికి ప్రాధాన్యం

**వరంగల్: అక్టోబర్ 22 (పీసీడబ్ల్యూ న్యూస్):** కాకతీయుల చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన వరంగల్ కోట అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.382 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఖిల్లా వరంగల్‌తో పాటు హనుమకొండలోని పలు కీలక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో ఖిల్లా వరంగల్ పునరుద్ధరణ, సెంట్రల్ ప్లాజా నిర్మాణం, బస్ టెర్మినల్ ఏర్పాటు, హనుమకొండలోని వేయి స్తంభాల మిగతా2లో...



## నవంబర్ 1న బీజేపీ మహా పాదయాత్ర

- జిల్లా కేంద్రాల్లోనూ నిరసన కార్యక్రమాలు



**హైదరాబాద్, అక్టోబర్ 22 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టేందుకు నవంబర్ 1న హైదరాబాద్‌లో మహా పాదయాత్ర నిర్వహించాలని తెలంగాణ బీజేపీ నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా

మిగతా2లో...

## సింగరేణి కార్మికుల హక్కుల కోసం పోరాడుతాం

- సంస్థ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం.. కార్మికుల సంక్షేమానికి కృషి: కేటీఆర్



**హైదరాబాద్, అక్టోబర్ 22 (పీసీడబ్ల్యూ న్యూస్):** సింగరేణి సంస్థ ప్రయోజనాలను కాపాడటంతో పాటు బొగ్గు గని కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. సింగరేణిని ప్రైవేటీకరణ దిశగా నడిపించే ప్రయత్నాలను అడ్డుకుంటామని, కార్మికులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమని తెలిపారు. గోదావరిఖనిలో ఇటీవల నిర్వహించిన సింగరేణి కార్మిక గర్జన సభ విజయవంతమైన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు గురువారం మిగతా2లో...


2లో

## మానవ పుట్టుక ఆదివాసీలతోనే మొదలు

- దేశానికి అసలైన వారసులు గిరిజనులే: మంత్రి సీతక్క

## ఇండియా కూటమి ఆన్‌లైన్ సమావేశం వాయిదా

నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న ర్యాలీపై చర్చ వాయిదా



**న్యూఢిల్లీ:అక్టోబర్ 22 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ఆందోళనలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌పై తదుపరి కార్యా చరణను ఖరారు చేసేందుకు ఇండియా కూటమి నేతలు నిర్వహించాల్సిన ఆన్‌లైన్ సమావేశం వాయిదా పడింది. గురువారం సాయంత్రం జరగాల్సిన ఈ సమావేశాన్ని కొన్ని నేతల ముందస్తు కార్యక్రమాల కారణంగా వాయిదా వేసినట్లు సమాచారం. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరగాల్సిన ఈ సమావేశంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై నిరసనల కార్యాచరణను రూపొందించడంతో పాటు, నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న కూటమి ర్యాలీ ఏర్పాట్లను సమీక్షించాల్సి ఉంది. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై ప్రభుత్వాన్ని నిలదీసే వ్యూహాలపైనా చర్చించాల్సి ఉంది. ఇటీవల ఓటరు జాబితా సవరణ అంశంపై ప్రతిపక్ష నేతలు ఢిల్లీలో నిరసన ప్రదర్శన నిర్వహించి, ఎన్నికల ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మిగతా2లో...

## కరువును ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలం

- లక్షల ఎకరాల్లో ఎండుతున్న పంటలు.. రైతుల కష్టాలు పట్టించుకోవడం లేదు
- గజ్వేల్‌లో ఎండిన పంటలను పరిశీలించిన మాజీ మంత్రి హరీశ్‌రావు



**గజ్వేల్,అక్టోబర్ 22 (పీసీడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని బూరుగుపల్లి గ్రామంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే మిగతా2లో...

# ఇండియా కూటమి ఆన్‌లైన్ సమావేశం వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

తదుపరి ఆందోళనలను ఉమ్మడిగా నిర్వహించేందుకు ఇండియా కూటమి నేతలు కార్యాచరణ రూపొందించాలని భావించారు.సమావేశం వాయిదా పడటంతో తదుపరి తేదీపై స్పష్టత రావాల్సి ఉంది. నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న ర్యాలీకి సంబంధించిన ఏర్పాట్లు, ఎన్నికల కమిషన్‌పై చేపట్టబోయే నిరసన కార్యక్రమాలపై కూటమి తదుపరి సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.

# సింగరేణి కార్మికుల హక్కుల కోసం పోరాడుతాం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ భవన్‌లో సింగరేణి ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు.ఈ సందర్భంగా సింగరేణి ప్రస్తుత పరిస్థితులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంస్థ ఆర్థిక వ్యవహారాలు, బొగ్గు ఉత్పత్తి తగ్గుదల, టెండర్లలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు, సంస్థకు రావాల్సిన నిధుల అంశాలపై చర్చించారు.ద

ఈ అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని కేటీఆర్ పార్టీ నాయకులకు సూచించారు.గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన కార్మిక సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, సింగరేణి ప్రాంతంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల పునరుద్ధరణ, కార్మిక సంఘం బలోపేతం కోసం సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు సింగరేణి సంస్థ పరిరక్షణకు, కార్మికుల హక్కుల సాధనకు కృషి చేస్తామని తెలిపారు. సమావేశానికి హాజరైన పలువురు నాయకులు కేటీఆర్‌కు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

# కరువును ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలం

(మొదటి పేజీ తరువాయి)

చింతా ప్రభాకర్, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డితో కలిసి హరీశ్‌రావు ఎండిన పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కరోనా వంటి అంతర్జాతీయ విపత్తును అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎదుర్కొన్నారని, కానీ రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ముందస్తు ప్రణాళికలు రూపొందించి రైతులను ఆదుకునే ప్రయత్నాలు చేస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం మాత్రం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.

**12 లక్షల ఎకరాలకు పైగా పంట నష్టం**రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షల ఎకరాలకు పైగా పంటలు ఎండిపోయాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. నెలల ముందుగానే ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం ఎందుకు ముందస్తు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. రైతులు సాగునీరు, తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా పాలకులు స్పందించడం లేదని విమర్శించారు.పత్తి పంటకు ఎకరానికి రెండు, మూడు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని, పెట్టుబడుల కోసం అప్పులు చేసిన రైతులు వాటిని ఎలా తీర్చుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు అండగా నిలిచి, వారికి అవసరమైన సహాయం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**పెట్టుబడులు పెట్టినా దక్కని ఫలితం** బూరుగుపల్లి గ్రామానికి చెందిన రైతు భాస్కర్‌రెడ్డి మూడు ఎకరాల్లో వరి సాగు చేయగా, పంటను కాపాడుకునేందుకు రోజుకు రూ.7 వేల వరకు ఖర్చు చేసినప్పటికీ చివరకు పంట పశువుల మేతగా మారిందని హరీశ్‌రావు వివరించారు. రైతులు పంటలను రక్షించుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నా, ప్రకృతి పరిస్థితులు మరియు నీటి కొరత కారణంగా నష్టాలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే గుర్తించి, ఎండిన పంటల వివరాలను సేకరించాలని, నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సాగునీరు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ రూపొందించాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చందన రవీందర్, వైస్ చైర్‌పర్సన్ పద్మ నర్సింగరావు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు బెండ మధు, మాజీ జెడ్పీటీసీ పంగ మల్లేశం తదితర నాయకులు పాల్గొన్నారు.

# మానవ పుట్టుక ఆదివాసీలతోనే మొదలు

**భద్రాద్రి కొత్తగూడెం:అక్టోబర్ 22 (పీసీడబ్ల్యూ న్యూస్):** మానవ పుట్టుక ఆదివాసీలతోనే ప్రారంభమైందని, దేశానికి అసలైన వారసులు ఆదివాసీలేనని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం ములకపాడులో ఏర్పాటు చేసిన కొమరం భీం విగ్రహాన్ని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో కలిసి ఆమె ఆవిష్కరించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా లక్ష్మీనగరం కేంద్రం నుంచి ములకపాడు వరకు వేలాది మంది గిరిజనులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీతక్క మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కుల పరిరక్షణకు, ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు కొమరం భీం అని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యేలు తెల్లం వెంకటరావు, పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంత గిరిజనుల సమస్యలపై శాసనసభలో పోరాడుతామని తెలిపారు.మాజీ ఎంపీ మిడియం బాబురావు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జీవో నంబర్ 3 రద్దు అంశంపై గిరిజన ఎమ్మెల్యేలు స్పందించి ఆదివాసీల హక్కుల సాధనకు కృషి చేయాలని కోరారు. ఏజెన్సీ అభివృద్ధికి కీలకమైన ప్రగళ్లపల్లి ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తి చేయాలని మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశారు. అనంతరం స్థానికులు వివిధ సమస్యలపై మంత్రికి వినతిపత్రాలు అందజేశారు.మాజీ జెడ్పీ చైర్మన్ చందా లింగయ్య దొర, ఆదివాసీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయండి

**విలీన ప్రక్రియ వెంటనే ప్రారంభించాలి**

**మంత్రులకు ఆర్టీసీ కార్మిక సంఘాల నేతల విజ్ఞప్తి**



**హైదరాబాద్,అక్టోబర్ 22 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)ని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం పలువురు మంత్రులను కలిసి తమ విజ్ఞప్తులను తెలియజేశారు.తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూయూ), స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్), స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యూయూ)కు చెందిన నాయకులు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ మంత్రుల నివాస సముదాయంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.**పదవీ విరమణ చేసిన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి** ఆర్టీసీలో పదవీ విరమణ చేసిన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా సంఘాల నేతలు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించడంతో పాటు, ఉద్యోగ విరమణ అనంతరం కార్మికులకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘాల నేతల వినతిపై స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్.. పదవీ విరమణ చేసిన ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

వారికి గతంలో రావాల్సిన పెండింగ్ బకాయిల చెల్లింపు అంశంపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మిక సంఘాల కూటమి నేతలు అశ్వత్థామరెడ్డి, రాజిరెడ్డి, వి.ఎస్. రావు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

# 2047 నాటికి వికసిత భారత్ నిర్మాణమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన పేర్కొన్నారు.భారతదేశం అన్ని రంగాల్లో పురోగతి సాధించాలంటే యువతకు నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని వెంకయ్య నాయుడు అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చినప్పుడే దేశం సమగ్రంగా ముందుకు సాగుతుందని తెలిపారు.దేశ ప్రగతిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, సేవాభావంతో పనిచేసే సంస్థలు సామాజిక మార్పునకు దోహదపడాలని ఆయన సూచించారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకూ అందినప్పుడే వికసిత భారత్ లక్ష్యం సార్థకమవుతుందని పేర్కొన్నారు. యువత దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, దేశ నిర్మాణంలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# రష్యాఉక్రెయిన్ యుద్ధం ముగియాలి: మోదీ

(మొదటి పేజీ తరువాయి)

సంబంధాల బలోపేతంపై మాట్లాడారు.భారత్, పోలండ్ మధ్య రక్షణ, అంతరిక్షం, అణుశక్తి, సాంకేతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించాలని ఇరువురు నేతలు నిర్ణయించారు. డ్రోన్లు, ఉపగ్రహ సాంకేతికతతో పాటు కీలక ఖనిజాలు, ఇంధన రంగాల్లోనూ పరస్పర సహకారానికి అవకాశాలను పరిశీలించారు.**2030 నాటికి వాణిజ్యం రెట్టింపు లక్ష్యం** భారత్‌పోలండ్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మోదీ తెలిపారు. భారత్‌యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఇరు దేశాల మధ్య వ్యాపార, పెట్టుబడి అవకాశాలను మరింత పెంచుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు స్టార్టప్ రంగంలోనూ సహకారాన్ని పెంచుకోవాలని నిర్ణయించారు.పోలండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్ భారత్‌తో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి తమ దేశం ఆసక్తిగా ఉందని తెలిపారు. ఈ సమావేశం ద్వారా ఇరు దేశాల మధ్య ఆర్థిక, సాంకేతిక, వ్యూహాత్మక భాగస్వామ్యానికి మరింత ఊతం లభించనుంది.

# కులగణనతో సామాజిక న్యాయం



**హైదరాబాద్,అక్టోబర్ 22 (పీసీడబ్ల్యూ న్యూస్):** ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చే అంశంపై మంత్రివర్గ ఉపసంఘం సమగ్రంగా అధ్యయనం చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలను ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో సరైన గణాంకాలు లేకపోవడంతో ముదిరాజ్‌లను బీసీ–ఏలో చేర్చే ప్రతిపాదనలకు న్యాయపరమైనసమస్యలు ఎదురయ్యాయని గుర్తుచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిర్వహించిన కులగణన వివరాల ఆధారంగా న్యాయనిపుణులు, అధికారులతో సంప్రదించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. **సామాజిక న్యాయమే లక్ష్యం**కులగణన బలహీనవర్గాలకు తమ హక్కుల కోసం నిలబడే ధైర్యాన్ని ఇచ్చిందని సీఎం పేర్కొన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అన్ని వర్గాలకు సముచిత న్యాయం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గంగపుత్రులకు అన్యాయం జరుగుతుందనే అపోహలను తొలగించేందుకు సంబంధిత వర్గాలతో చర్చించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సూచించారు.**పండుగ సాయన్న సేవలు చిరస్మరణీయం**జమీందార్లు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పేదలు, బహుజనుల హక్కుల కోసం పండుగ సాయన్న పోరాడారని సీఎం కొనియాడారు. ఆయనతో పాటు దొడ్డి కొమురయ్య చరిత్రను భావితరాలకు పరిచయం చేయాలని, వారికి సముచిత గుర్తింపు కల్పించాలని అన్నారు.రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని పేర్కొన్న సీఎం, సన్నబియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రైతు భరోసా, రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాల వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, శాసనమండలి ఉపాధ్యక్షుడు బండ ప్రకాశ్, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# వరంగల్ కోట అభివృద్ధికి రూ.382 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

గుడి పరిసరాల అభివృద్ధి, మ్యూజికల్ గార్డెన్ వంటి పనులు చేపట్టనున్నారు. చారిత్రక కట్టడాలను పరిరక్షించడంతో పాటు పర్యాటకులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ఈ ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యం.**ప్రపంచ బ్యాంకు నిధులతో అభివృద్ధి పనులు** కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పర్యవేక్షణలో ఈ ప్రాజెక్టులను అమలు చేయనున్నారు. ఇందుకోసం ప్రపంచ బ్యాంకు నిధులను వినియోగించనున్నారు. చారిత్రక ప్రదేశాలను ఆధునిక సదుపాయాలతో అనుసంధానించడం ద్వారా పర్యాటకులను మరింతగా ఆకర్షించాలని ప్రభుత్వం భావిస్తోంది.ఈ అభివృద్ధి పనులు పూర్తయితే వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి వంటి చారిత్రక ప్రదేశాలకు మరింత ప్రాచుర్యం లభించనుంది. పర్యాటక రంగం విస్తరించడంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు నగర అభివృద్ధికి కూడా దోహదపడనుంది. కాకతీయుల చారిత్రక వారసత్వాన్ని కాపాడుతూ వరంగల్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఈ ప్రాజెక్టులు కీలకంగా మారనున్నాయి.

# నవంబర్ 1న బీజేపీ మహా పాదయాత్ర

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రాల్లోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించింది.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచంద్రరావు అధ్యక్షతన గురువారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అనంతరం రాంచంద్రరావు మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ ప్రజల్లో అపోహలు సృష్టిస్తోందని ఆరోపించారు. మైనారిటీల ఓట్లను తొలగిస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు వాస్తవాలు వివరించేందుకు పాదయాత్ర, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యం: మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్,అక్టోబర్ 22 (పీసీడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. నాంపల్లిలో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అర్హులైన పట్టభద్రులందరినీ నవంబరు 6లోపు ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. ప్రతి ప్రాంతంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పట్టభద్రులకు వివరించాలని కోరారు. సమావేశంలో మంత్రి అజారుద్దీన్, ఎంపీలు మల్లు రవి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డు పరిసర మరణాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

**- మృతుడు మహ్మద్ సలీం కుటుంబాన్ని ఆదుకోవాలి: పోరాట కమిటీ డిమాండ్**



**జవహర్‌నగర్, అక్టోబర్ 22 (పీసీడబ్ల్యూ న్యూస్):** జవహర్‌నగర్ రాంకీ డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, వరుస మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న దుర్వాసన, పొగ, విషవాయువులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గబ్బిలాలపేటలోని ఈస్ట్ నందమూరి నగర్‌కు చెందిన మహ్మద్ సలీం (40) ఈ నెల 20వ తేదీ తెల్లవారుజామున శ్వాస తీసుకోవడంలో ఇబ్బందితో మరణించినట్లు కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. గద్వాల జిల్లా గట్టు మండలం గొల్లపల్లి నుంచి రెండేళ్ల క్రితం జీవనోపాధి కోసం జవహర్‌నగర్‌కు వచ్చిన సలీం, ఉల్లిగడ్డల వ్యాపారం చేసుకుంటూ భార్య, ఇద్దరు పిల్లలను పోషించేవారని తెలిపారు. గత రెండు, మూడు నెలలుగా డంపింగ్ యార్డు పరిసరాల్లో దుర్వాసన, పొగ సమస్య పెరిగిందని స్థానికులు చెబుతున్న నేపథ్యంలో గాలి, నీరు, భూమి నాణ్యతపై శాస్త్రీయ పరీక్షలు నిర్వహించాలని షావలి కోరారు. గతంలో మరణించిన డి. అరుణ, గాదరి సోమయ్య, బొల్లం కృష్ణ మృతులపైనా పరిశీలన జరపాలని, మరణాలకు గల కారణాలను వైద్యపరంగా నిర్ధారించాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డు కాలుష్యమే మరణాలకు కారణమని ఇప్పటివరకు నిర్ధారణ కాలేదని, సమగ్ర విచారణతో వాస్తవాలు వెల్లడించాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం డంపింగ్ యార్డును శాశ్వతంగా తరలించేందుకు చర్యలు తీసుకోవాలని, చెత్త తరలింపును నిలిపివేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. జవహర్‌నగర్‌తోపాటు దమ్మాయిగూడ, కీసర, యాప్రాల్, చెర్లపల్లి ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మహ్మద్ సలీం కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం అందించి, భార్యాపిల్లలకు ఆర్థిక భద్రత కల్పించాలని కమిటీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్లు మహ్మద్ జావేద్, శారద పాల్గొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

# డంపింగ్ యార్డు నిర్వహణ రాష్ట్రం చేతిలో.. అనుమతులు కేంద్రం చేతిలో!

**ప్రజల చెవిలో పువ్వులు పెట్టొద్దు**

**పాదయాత్రకు ముందే పర్యావరణ అనుమతులు రద్దు చేయించాలి: షేక్ షావలి**

**జవహర్‌నగర్, అక్టోబర్ 22 (పీసీడబ్ల్యూ న్యూస్):** జవహర్‌నగర్ రాంకీ డంపింగ్ యార్డు నిర్వహణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని జీహెచ్‌ఎంసీ చేతిలో ఉండగా, పర్యావరణ అనుమతులు కేంద్ర ప్రభుత్వ సంస్థల పరిధిలో ఉన్నాయని సీపీఐ (ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి అన్నారు. డంపింగ్ యార్డు సమస్యపై పాదయాత్ర చేపట్టే ముందు మేడ్చల్ ఎంపీ ఈటల రాజేందర్ కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పర్యావరణ అనుమతులు రద్దు చేయించాలని డిమాండ్ చేశారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డంపింగ్ యార్డు కారణంగా ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, మరణాలు, కాలుష్యంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని షావలి పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్షంలో బాధ్యతలు స్వీకరించిన ఈటల రాజేందర్.. పాదయాత్రకు ముందు తన వైఖరిని స్పష్టం చేయాలని కోరారు. బాధితులు, మేధావులతో సమావేశాలు నిర్వహిస్తామని చెప్పడం కంటే సమస్య పరిష్కారానికి స్పష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. డంపింగ్ యార్డు నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండగా, పర్యావరణ అనుమతులు కేంద్ర సంస్థల పరిధిలో ఉన్నందున రెండు ప్రభుత్వాలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని షావలి అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం, జీవించే హక్కుకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. డంపింగ్ యార్డుకు పర్యావరణ అనుమతులు రద్దు చేయించేలా ఎంపీ ఈటల రాజేందర్ కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనుమతుల రద్దు అంశంపై కేంద్రం స్పష్టమైన నిర్ణయం తీసుకుంటే, డంపింగ్ యార్డు మూసివేత, తరలింపుపై రాష్ట్ర ప్రభుత్వం తన కార్యాచరణను ప్రకటించాలని అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, బాధితులు, పర్యావరణ నిపుణుల భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. డంపింగ్ యార్డు సమస్యను పార్లమెంట్‌లో ప్రస్తావించినప్పటికీ కేంద్రం స్పందించడం లేదని షావలి ఆరోపించారు. రాంకీ సంస్థ యజమాని, బీజేపీ ఎంపీ అయోధ్య రామిరెడ్డితో సంబంధం ఉన్నందునే కేంద్రం చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఈటల రాజేందర్ కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అనుమతుల రద్దుకు కృషి చేయాలని కోరారు. జవహర్‌నగర్‌తోపాటు పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని షేక్ షావలి డిమాండ్ చేశారు. ప్రజలను మభ్యపెట్టే ప్రకటనలకు బదులుగా డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.



# పేద విద్యార్థుల విద్యాప్రదాత ఎస్ఆర్ శంకరన్

**- గురుకుల విద్యా వ్యవస్థకు పునాది వేసిన దార్శనికుడు..**

**- ఉచిత విద్య, వసతి, సమాన అవకాశాల కల్పనలో ఎస్.ఆర్ శంకరన్ సేవలు చిరస్మరణీయం**

**- స్వేరోస్ జిల్లా అధ్యక్షులు కోంద్రు రామచంద్రు**





**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పేద విద్యార్థుల విద్యాప్రదాత ఎస్.ఆర్ శంకరన్ అని, ఉచిత విద్య, వసతి, సమాన అవకాశాల కల్పనలో ఆయన సేవలు చిరస్మరణీయమని స్వేరోస్ జిల్లా అధ్యక్షులు కోంద్రు రామచంద్రు అన్నారు. ఖమ్మం నగరంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద గురువారం ఎస్.ఆర్ శంకరన్ 92వ జయంతి, స్వేరోస్ డే లను పురస్కరించుకొని స్వేరోస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్.ఆర్ శంకరన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాం సుందర్ తో కలిసి స్వేరోస్ జిల్లా అధ్యక్షులు కోంద్రు రామచంద్రు స్వేరోస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ స్వేరోస్ నాయకులు మాట్లాడుతూ.. సమాజంలో పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదు.. కులం, ఆర్థిక స్థితిగతులు, సామాజిక వివక్ష పిల్లల భవిష్యత్తుకు అడ్డంకులు కావద్దు.. పేద కుటుంబాల్లో పుట్టిన పిల్లలు కూడా ఉన్నత విద్యను అభ్యసించి గౌరవప్రదమైన జీవితాన్ని సాధించాలనే ఆశయాలతో తన జీవితాన్ని సామాజిక సేవకు అంకితం చేసిన గొప్ప పరిపాలనా దార్శనికుడు డాక్టర్ ఎస్.ఆర్ శంకరన్ అని కొనియాడారు. ప్రభుత్వ పదవిని అధికార ప్రదర్శనకు కాకుండా అణగారిన వర్గాల అభ్యున్నతికి ఉపయోగించిన ఆయనను ప్రజలు ప్రేమతో 'పేదల ఐఏఎస్ అధికారి'గా గుర్తుచేసుకుంటున్నారన్నారు. డాక్టర్ ఎస్.ఆర్ శంకరన్ 1934 అక్టోబర్ 22న జన్మించారని అన్నారు. ఆయన 92వ జయంతి సందర్భంగా విద్య, సామాజిక న్యాయం, పేదల సంక్షేమం కోసం చేసిన ఎస్.ఆర్ శంకరన్ సేవలను స్మరించుకోవడం సమాజానికి ఎంతో అవసరం అన్నారు. పేద కుటుంబాలకు చెందిన పిల్లలు ప్రైవేటు పాఠశాలల్లో చదివే స్థోమత లేక నాణ్యమైన విద్యకు దూరమవుతున్న పరిస్థితులను మార్చేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1984లో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల అభివృద్ధికి శంకరన్ కృషి చేశారన్నారు. పేదల కన్నీళ్లు తుడవడమే నిజమైన ప్రజాసేవగా భావించిన ఎస్.ఆర్. శంకరన్ జీవితం.. విద్యను హక్కుగా చూడాలని, సంక్షేమాన్ని సామాజిక బాధ్యతగా అమలు చేయాలని నేటి సమాజానికి చాటి చెబుతోంది. ఈ కార్యక్రమంలో సీనియర్ స్వేరోస్ నాయకులు పోలేపొంగు ఆంజనేయులు, మోదుగు నాగేశ్వరావు, కలకోట సంపత్, పిడమర్తి వెంకటేశ్వర్లు, శీలం ప్రసాద్, మందుల వెంకన్న, బండ్ల నాగేశ్వరరావు, డాక్టర్ పిసి వీరస్వామి, వంగూరి దశరద్, మేకల భాస్కర్, మందుల రమేష్, అప్పారావు, గౌతమ్, చిట్టిబాబు, మహేష్, గద్దల నాగరాజు, గుజ్జు కృష్ణ, మోదుగు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# జనాభా గణనకు క్షేత్రస్థాయిలో పటిష్ఠ ప్రణాళిక

**● గణన బ్లాకుల గుర్తింపుపై అధికారులకు శిక్షణ ప్రారంభం**




**ములుగు జిల్లా అక్టోబర్22(పిసిడబ్ల్యూ న్యూస్):** జనాభా గణన2027 రెండవ దశ నిర్వహణకు సంబంధించి క్షేత్రస్థాయిలో పటిష్ఠ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచిస్తూ, గణన బ్లాకులు, ఉప గణన బ్లాకుల ఏర్పాటుపై నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్. మహేందర్ గురువారం ప్రారంభించారు. ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అక్టోబర్ 22, 23 తేదీల్లో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. జనాభా గణన రెండవ దశలో భాగంగా గణన బ్లాకులు, ఉప గణన బ్లాకులను గుర్తించడం, వాటి ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలపై హైదరాబాద్ నుంచి వచ్చిన జనగణన శాఖ అధికారులు విహేందర్ బాబు, నాయుడు అధికారులకు శిక్షణ అందిస్తున్నారు. జనాభా గణన ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలు, గణన ప్రాంతాల గుర్తింపు, సంబంధిత అధికారుల బాధ్యతలపై ఈ శిక్షణలో అవగాహన కల్పిస్తున్నారు. గణనకు సంబంధించిన ఏర్పాట్లను ముందుగానే ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసేందుకు అధికారులకు అవసరమైన సూచనలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణవేణి, ముఖ్య ప్రణాళిక అధికారి, ఛార్జ్ అధికారులు, అదనపు ఛార్జ్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, గణాంక అధికారులు, ఈడీఎం, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కోర్టు స్టేతో జాకారం సర్పంచ్‌గా సమత రమేష్ తిరిగి బాధ్యతల స్వీకరణ



**ములుగు, అక్టోబర్ 22 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** జాకారం గ్రామ సర్పంచ్ దాసరి సమత రమేష్ కోర్టు స్టే ఉత్తర్వులతో గురువారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. గతంలో సస్పెన్షన్‌కు గురైన ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, అనుకూల ఉత్తర్వులు రావడంతో పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్ అధికారికంగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా సమత రమేష్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆమె తిరిగి బాధ్యతలు చేపట్టడంపై పలువురు నాయకులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు గండ్రత్ దామోదర్, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్‌కు కాంగ్రెస్ మైనార్టీ విభాగం వినతిపత్రం**



**కరీంనగర్, అక్టోబర్ 22 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా నవంబర్ 11న నిర్వహించే జాతీయ విద్యా దినోత్సవాన్ని ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని జిల్లా కాంగ్రెస్ మైనార్టీ విభాగం చైర్మన్ ముహమ్మద్ తాజుద్దీన్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో కలెక్టరేట్ ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖుల ప్రసంగాలతో వేడుకలు నిర్వహించాలని కోరారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో, విద్యాభివృద్ధిలో మౌలానా ఆజాద్ చేసిన సేవలను భావితరాలకు తెలియజేయడంతో పాటు జాతీయ సమైక్యత, మత సామరస్యాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఏ. మొసిన్, అహ్మద్ అలీ, నెహల్ అహ్మద్, అబ్దుల్ రహేమాన్, కలీముద్దీన్, ముహమ్మద్ అమీర్, ఎం.ఏ. జమీల్, అబ్దుల్ బారి తదితరులు పాల్గొన్నారు.

# వెంకట్‌రెడ్డి నగర్ డివిజన్ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షుడిగా రంగు శేఖర్ గౌడ్

**- పార్టీ బలోపేతానికి కృషి.. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం**




**ఉప్పల్, అక్టోబర్ 22 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రక్షణ సేన వెంకట్‌రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షుడిగా రంగు శేఖర్ గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రావణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని రంగు శేఖర్ గౌడ్ పేర్కొన్నారు. డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని స్పష్టం చేశారు.

# తరగతి గదిలోనే దేశ నిర్మాణం

**ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి..**

**ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య**

**అందించాలి: ప్రొఫెసర్ వెంకటదాసు**

**హైదరాబాద్, అక్టోబర్ 22 (పీసీడబ్ల్యూ న్యూస్):**తెలంగాణలో ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసి, ప్రతి విద్యార్థికి సమానమైన నాణ్యమైన విద్య అందించాలని డెమోక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ (డేటా) గౌరవ అధ్యక్షుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ వెంకటదాసు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర విద్యా వ్యవస్థలోని సమస్యలను గుర్తించి, వాటి పరిష్కార మార్గాలను రూపొందించే లక్ష్యంతో డేటా నిర్వహించిన మూడు రోజుల కార్యశాలలో ఆయన మాట్లాడారు.విద్య కేవలం ఉద్యోగం సంపాదించేందుకు ఉపయోగపడే సాధనం మాత్రమే కాదని, వ్యక్తిత్వ వికాసానికి, సామాజిక సమానత్వానికి, దేశ అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. తరగతి గదిలోనే దేశ నిర్మాణానికి బీజం పడుతుందని, అన్ని వర్గాల పిల్లలకు సమాన విద్యా అవకాశాలు కల్పించినప్పుడే చిన్నతనం నుంచే సమానత్వ భావన పెంపొందుతుందని తెలిపారు.**ఏకరీతి పాఠశాల వ్యవస్థతోనే సమానత్వం**కుల, మత, ఆర్థిక భేదాలు లేకుండా అన్ని వర్గాల పిల్లలు ఒకే తరహా పాఠశాలల్లో కలిసి చదువుకునే విధానం ద్వారా పరస్పర గౌరవం, సమానత్వ భావనలు బలపడతాయని వెంకటదాసు అన్నారు. విద్య అనేది కుటుంబ ఆర్థిక స్థితిగతులపై ఆధారపడకూడదని, ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య హక్కుగా అందాలని స్పష్టం చేశారు. ప్రైవేటు విద్యా వ్యాపార ప్రయోజనాలకు అతీతంగా ప్రభుత్వమే బాధ్యత తీసుకుని అందరికీ నాణ్యమైన విద్య అందించేలా ఏకరీతి పాఠశాల వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు.**పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి**విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు పరీక్షల మార్కులకే పరిమితం కాకుండా విద్యార్థుల చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానం, తార్కిక ఆలోచన, ప్రశ్నించే సామర్థ్యాలను అంచనా వేయాలని సూచించారు. అభ్యసనంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక బోధన అందించాలని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయడంతోపాటు తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అవసరాలకు అనుగుణంగా విద్యా బడ్జెట్ కేటాయించి, నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని పేర్కొన్నారు.**ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం తగ్గించాలి**ఉపాధ్యాయులకు బోధనపై పూర్తి దృష్టి సారించే అవకాశం కల్పించాలని, బోధనేతర పనుల భారాన్ని తగ్గించాలని వెంకటదాసు అన్నారు. నిరంతర వృత్తిపరమైన శిక్షణ, అవసరమైన బోధనా సామగ్రి, మెరుగైన పని వాతావరణం కల్పించినప్పుడే విద్యా ప్రమాణాలు పెరుగుతాయని వివరించారు. పాఠశాలల పర్యవేక్షణ తనిఖీలు, నివేదికలకే పరిమితం కాకుండా సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా ఉండాలని సూచించారు.**విద్యా పునర్నిర్మాణానికి సమష్టి కార్యాచరణ**ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెంచేందుకు నాణ్యమైన బోధన, మెరుగైన సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని డేటా పేర్కొంది. పేదరికం, సామాజిక వెనుకబాటుతనం, కుటుంబ పరిస్థితుల కారణంగా ఏ విద్యార్థీ చదువుకు దూరం కాకుండా అవసరమైన సహకారం అందించాలని సూచించింది.ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిపై సమగ్ర అధ్యయనం చేసి, జిల్లా వారీగా సమస్యలను గుర్తించాలని, ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ, మౌలిక సదుపాయాల కల్పన, ప్రాథమిక అభ్యసన నైపుణ్యాల పెంపు, ఉపాధ్యాయ శిక్షణ, నిధుల సమర్థ వినియోగానికి కార్యాచరణ రూపొందించాలని కోరింది. విద్యా విధానాల రూపకల్పన, అమలులో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, విద్యావేత్తల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపింది.విద్యా వ్యవస్థలోని సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వంపై ప్రజాస్వామ్యబద్ధంగా ఒత్తిడి తీసుకురావడంతోపాటు, ఆచరణ సాధ్యమైన ప్రత్యామ్నాయాలను ముందుకు తీసుకెళ్లాలని కార్యశాలలో నిర్ణయించినట్లు ప్రొఫెసర్ వెంకటదాసు తెలిపారు.విద్య బాగుంటే కుటుంబం, కుటుంబం బాగుంటే సమాజం, సమాజం అభివృద్ధి చెందితే దేశం బలపడుతుందని ఆయన పేర్కొన్నారు. అందుకే ప్రభుత్వ విద్యను పటిష్ఠం చేసి, ప్రతి విద్యార్థికి సమానమైన నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వంతోపాటు సమాజం ముందున్న కీలక బాధ్యత అని స్పష్టం చేశారు.



# హిమాయత్‌నగర్‌లో ఘనంగా రావణ దహనం

**- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు, చిన్నారుల కర్రసాము విన్యాసాలు**





**హిమాయత్‌నగర్, అక్టోబర్ 22 (పి.సి.డబ్ల్యూ న్యూస్):**భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని కేశవ్ మెమోరియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానంలో రావణ దహన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు, చిన్నారుల కర్రసాము విన్యాసాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.ఖైరతాబాద్ అసెంబ్లీ ఉత్సవ సమితి కన్వీనర్ కొయ్యాడ నర్సింగ్ మాట్లాడుతూ, కులమత భేదాలకు అతీతంగా హిందువుల ఐక్యత, ధర్మ పరిరక్షణే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. హిమాయత్‌నగర్ డివిజన్ కన్వీనర్ గోపిశెట్టి ప్రమోద్ మాట్లాడుతూ, ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు.ఉత్సవ సమితి కో-కన్వీనర్ ధీరేందర్ బియానీ విజయదశమి శుభాకాంక్షలు తెలుపుతూ, చెడుపై మంచి సాధించిన విజయానికి దసరా ప్రతీక అని పేర్కొన్నారు. కర్రసాము ప్రదర్శించిన చిన్నారులను అభినందించి, పిల్లలకు ఆత్మరక్షణ విద్యల్లో శిక్షణ ఇప్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. మరో కో-కన్వీనర్ తోట మల్లికార్జున్ హిందువుల ఐక్యతకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సమితి నాయకులు మహేష్, సంతోష్, గోపి, నారాయణగూడ పోలీస్ స్టేషన్ అధికారి సిద్ధేశ్వర్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ములుగు కలెక్టరేట్‌లో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

**ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధం: అదనపు కలెక్టర్ సంపత్‌రావు**

**ట్యాంక్‌బండ్‌పై, జిల్లా కేంద్రాల్లో కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేయాలి: అచ్చునూరి కిషన్ ముదిరాజ్**



**ములుగు, అక్టోబర్ 22 (పి.సి.డబ్ల్యూ న్యూస్):**రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ములుగు కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరొందిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

అదనపు కలెక్టర్ సంపత్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని, పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సంపత్‌రావు మాట్లాడుతూ ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.మెపా జిల్లా అధ్యక్షుడు అచ్చునూరి కిషన్ ముదిరాజ్ మాట్లాడుతూ పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై, ప్రతి జిల్లా కేంద్రంలో పండుగ సాయన్న కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేయాలని, ఆయన జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి డి. రామ్మోహన్, ముదిరాజ్ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, సంఘం పెద్దలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్ హాఫీజుద్దీన్ సతీమణి అఫ్జలున్నిసా మృతి

- మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖుల సంతాపం
- అసదుద్దీన్ ఒవైసీ ఫోన్‌లో పరామర్శ





**కరీంనగర్, అక్టోబర్ 22 (పి.సి.డబ్ల్యూ న్యూస్):**కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ దివంగత సయ్యద్ హాఫీజుద్దీన్ అలియాస్ హాఫిజ్ భాయ్ సతీమణి అఫ్జలున్నిసా బేగం (90) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. ఖాద్రీ కుటుంబంలో మంచితనానికి మారుపేరుగా నిలిచిన ఆమె మృతి పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ఆమె కుమారుడు, ఎంఐఎం సీనియర్ నాయకుడు హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్‌ను ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఫోన్‌లో పరామర్శించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, మాజిద్ హుస్సేన్, జాఫర్ హుస్సేన్ మేరాజ్, మీర్ జుల్ఫిఖార్ అలీ తదితర రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు. ఎమ్మెల్సీ రియాజుల్ హసన్ ఎఫెండీ, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, సుడా మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు సహా పలువురు ప్రముఖులు కుటుంబానికి తమ సానుభూతిని తెలియజేశారు.కరీంనగర్ పురాతన జామా మసీదులో జుహర్ నమాజ్ అనంతరం నిర్వహించిన నమాజే జనాజాకు వందలాది మంది హాజరై ప్రార్థనలు చేశారు. అనంతరం తకియా మొహల్లా ఖబ్రస్తాన్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ముస్లిం మత పెద్దలతో పాటు హిందూ సోదరులు కూడా తరలివచ్చి హాఫిజ్ యూసుఫ్‌ను పరామర్శించారు.

# ఆపదలో ఉన్నవారికి అండగా నెంబర్ వెంకట్

**సాయం చేయడానికి స్థాయితో సంబంధం లేదు మంచి మనసుంటే చాలు**

**సండ్ర వెంకట వీరయ్య అనుచరుడు, మాజీ వార్డు సభ్యుడు కొత్తపల్లి వెంకటేశ్వర్లు (నెంబర్ వెంకట్)**



**కల్లూరు, అక్టోబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం, కన్నీటితో ఉన్నవారికి భరోసా ఇవ్వడం, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం నిజమైన మానవత్వానికి నిదర్శనం. అలాంటి మంచి మనసును చాటుకుంటూ కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌కు చెందిన ఇద్దరు నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి తన ఉదారతను చాటుకున్నారు నెంబర్ వెంకట్.ఇటీవల గోపాలకుంటలో ఓ ఇంటి వద్ద తాపీ పని చేస్తుండగా పరంజీ కర్ర విరిగి కిందపడటంతో ఖమ్మంపాటి నరసింహారావు, గండు సత్యం తీవ్రంగా గాయపడి ఇద్దరూ కాళ్లు విరిగి మంచానికే పరిమితమయ్యారు. రోజువారీ కూలీ పనులు చేసుకుంటేనే కుటుంబాలు గడిచే పరిస్థితుల్లో, కుటుంబ యజమానులు పని చేయలేని స్థితికి చేరడంతో ఆ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.వారి దీనస్థితిని తెలుసుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అనుచరుడు నెంబర్ వెంకట్ స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు."గతంలో నేను కూడా ఆరు నెలల పాటు



మంచానికే పరిమితమయ్యాను. ఆ బాధ ఎలా ఉంటుందో నాకు తెలుసు. అందుకే వారి కష్టాన్ని నా కష్టంగా భావించి నా వంతు సాయం అందించాను" అని ఆయన పేర్కొనడం ఆయనలోని మానవత్వానికి అద్దం పడుతోంది.పదవులు ఉన్నప్పుడే కాదు.. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు స్పందించే మనసే నిజమైన నాయకత్వానికి గుర్తింపుబాధిత కుటుంబాలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ప్రతి ఒక్కరూ తమకు తోచినంత సహాయం చేసి ఆ కుటుంబాలకు అండగా నిలవాలని నెంబర్ వెంకట్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఖమ్మంపాటి పుల్లారావు, మోదుగు రమేష్, తేలపుట్ట శ్రీనివాసరావు, కొత్తపల్లి వంశీ తదితరులు పాల్గొన్నారు.



# వెంకట్‌రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నికపై వివాదం!

### వ్యక్తిగత పెత్తనం వద్దు.. ప్రజాస్వామ్యమే ముద్దు

### అక్టోబర్ 30న అందరి సమక్షంలో ఎన్నికలు నిర్వహించాలి: కాలనీవాసుల డిమాండ్

**ఉప్పల్, అక్టోబర్ 22 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** వెంకట్‌రెడ్డి నగర్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎంపిక వ్యవహారం వివాదానికి దారితీస్తోంది. కాలనీవాసులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా కొత్త కమిటీ పేర్లను తెరపైకి తీసుకురావడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అందరి సమక్షంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. గత ఏప్రిల్ 28న పెద్దల సమక్షంలో జరిగిన చర్చల్లో ప్రస్తుత కమిటీని రద్దు చేసి, అక్టోబర్ 30, 2026న కాలనీవాసుల ఆమోదంతో కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని ఏకాభిప్రాయం కుదిరినట్లు వారు పేర్కొంటున్నారు. ప్రస్తుత కమిటీ పదవీకాలం అక్టోబర్ 29తో ముగియనున్న నేపథ్యంలో, గత నిర్ణయానికి అనుగుణంగా ఎన్నికల ప్రక్రియ చేపట్టాలని కోరుతున్నారు.

**ఏకపక్ష నిర్ణయాలు వద్దు!** వెల్ఫేర్ అసోసియేషన్ ఏ ఒక్కరికో చెందినది కాదని, మొత్తం కాలనీ అభివృద్ధి, సంక్షేమం కోసం ఏర్పడిన సంఘమని కాలనీవాసులు స్పష్టం చేస్తున్నారు. కమిటీ ఎంపికలో వ్యక్తిగత ఆధిపత్యానికి తావివ్వకుండా ప్రతి ఒక్కరి అభిప్రాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు.

**అందరి సమక్షంలో కొత్త కమిటీ ఏర్పాటు చేయాలి** కాలనీ పెద్దలు, కోర్ కమిటీ సభ్యులు, కాలనీవాసుల సమక్షంలో పారదర్శకంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కమిటీ ఎంపికపై విభేదాలు పెరగకుండా అందరూ ఐక్యంగా వ్యవహరించి, కాలనీ అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# రీ-సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

### ●రైతులు, గ్రామస్థులు సహకరించాలి:సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్




**సత్తుపల్లి, అక్టోబర్ 22 (పీసీడబ్ల్యూ న్యూస్)** :సత్తుపల్లి మండలం సదాశివునిపాలెం గ్రామంలో గురువారం నిర్వహించిన భూ పునఃసర్వే (రీ-సర్వే) గ్రామసభకు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రీ-సర్వే లక్ష్యాలు, ప్రాముఖ్యత, సర్వే నిర్వహణ ప్రక్రియపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. భూముల హద్దుల నిర్ధారణ, భూ సంబంధిత సమస్యల పరిష్కారంలో రీ-సర్వే కీలకమని వివరించారు. సర్వే ప్రక్రియలో రైతులు, గ్రామస్థులు తమ అభిప్రాయాలు తెలియజేస్తూ అధికారులకు సహకరించాలని సూచించారు. భూ సర్వేకు సంబంధించిన సందేహాలు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సర్వే బృందం సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# బీసీలకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

### ●నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలి ●విలేకరుల సమావేశంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పొదిల సతీష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి యలమందల జగదీష్




**ఖమ్మం,ప్రతినిధి అక్టోబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గవర్నర్ కోటాలో డాక్టర్ లోకేష్ యాదవ్ ఇవ్వాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పొదిల సతీష్ యాదవ్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి, నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఖమ్మం నగర అధ్యక్షులు యలమందల జగదీష్ పేర్కొన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వారు మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలోనూ , ఎన్ఎస్ యుఐ విద్యార్థి సంఘం నాయకుడు నుండి రాష్ట్ర అధికార ప్రతినిధి గా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పాటుపడిన లోకేష్ యాదవ్, నాయి బ్రాహ్మణ బిడ్డ జంపాల రాజేష్ లకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకపోతే తమ గోడు ఎవరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. 2014, 2018, 2023 ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, రాజ్యసభ, మంత్రి పదవి కూడా ఒక్క బీసీకి కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల జనాభా శాతం ఎక్కువగా ఉన్నా చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం కరువైందని పేర్కొన్నారు. ఓట్లు మావి సీట్లు మీవా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీసీలకు న్యాయం చేయాలని లేనిచో రాష్ట్రవ్యాప్తంగా బీసీల ఉద్యమానికి శ్రీకారం చుడతామని పేర్కొన్నారు. ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికలలో నాయి బ్రాహ్మణులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బత్తుల వీరబాబు, పగడాల హనుమంతరావు, రాగం కోటి, నాగరాజు, వినయ్, వంశి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ముంబై, భివండి, సూరత్ ఉద్యమకారుల సమష్టి కార్యాచరణకు నిర్ణయం

### రాజగృహ సాక్షిగా మూడు ప్రాంతాల ఉద్యమకారుల మధ్య సమన్వయ కమిటీ ఏర్పాటు

### ఉద్యమకారుల గుర్తింపు కమిటీతో కలిసి భవిష్యత్తు కార్యాచరణకు ప్రణాళిక

**ముంబై అక్టోబర్22 (పిసిడబ్ల్యూ న్యూస్):** ముంబై, భివండి, సూరత్ ప్రాంతాల్లోని తెలంగాణ ఉద్యమకారులు ఇకపై సమష్టిగా పనిచేయాలని నిర్ణయించారు. తెలంగాణలోని కెకె కమిటీ సూచనల మేరకు సూరత్ ఉద్యమకారులు ముంబై, భివండి జేఏసీ ఉద్యమకారులతో సమావేశమై, పరస్పర సమన్వయంతో భవిష్యత్తు కార్యాచరణను కొనసాగించేం దుకు అంగీకరించారు.గురువారం ముంబైలోని దాదర్‌లో ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ నివాసం రాజగృహ వద్ద ఇరు రాష్ట్రాల ఉద్యమకారుల తొలి చారిత్రక సమావేశం జరిగింది. ముందుగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం చిన్న రాష్ట్రాల నిర్మాణానికి సంబంధించిన అంశాలను గుర్తుచేసుకుంటూ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌కు నివాళులర్పించి సమావేశాన్ని ప్రారంభించారు.ఈ సమావేశానికి సూరత్ వలస ప్రజల జేఏసీ పదాధికారులైన అనుముల రవీందర్, గోనె సోమన్న, సిద్ధ శ్రీనివాస్, మచ్చ వీరన్న, గోడితాల లక్ష్మీపతి హాజరయ్యారు.కెకె కమిటీ సభ్యులు, ప్రొఫెసర్



కోదండరాం సూచనల మేరకు సూరత్, నవీ ముంబై, భివండి, ముంబై ప్రాంతాల ఉద్యమకారుల మధ్య సమన్వయం ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా రాజగృహ సాక్షిగా ఇరుపక్షాల ఏకగ్రీవ అంగీకారంతో సమన్వయ కమిటీని ఏర్పాటు



చేశారు.**భవిష్యత్తు కార్యాచరణపై చర్చ** భవిష్యత్తులో ఇరు రాష్ట్రాల ఉద్యమకారులు సమష్టిగా పనిచేస్తూ, ఉద్యమకారుల గుర్తింపు కమిటీతో సంప్రదింపులు జరపాలని సమావేశంలో నిర్ణయించారు. అలాగే ఇటీవల తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన వెబ్‌సైట్, పోర్టల్‌కు సంబంధించిన వివరాలను సవివరంగా చర్చించారు. వాటిని ఎలా ఉపయోగించాలి, వాటి ద్వారా ఏ విధంగా ప్రయోజనం పొందవచ్చనే అంశాలపై కూడా చర్చ సాగింది.ఈ చారిత్రక సమావేశంలో భివండి ప్రతినిధులు సిరిమల్ అశోక్, సిరిపురం తిరుపతి పాల్గొన్నారు. ముంబై ప్రతినిధులైన నిరటి భుమన్న, శివరాజ్ బొల్లే, రమేష్ చౌవల్, నాగసేన్ మాలజీ, అలివేలు యాకారి, మూలనివాసి మాలజీ సమావేశానికి హాజరయ్యారు.మూడు ప్రాంతాల ఉద్యమకారుల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసుకుంటూ, భవిష్యత్తులో ఉమ్మడి కార్యాచరణను కొనసాగించాలనే లక్ష్యంతో ఈ సమావేశం జరిగింది.

# హర్యాతండాలో సేవా దంపతులకు ఘన సన్మానం

### ●మహా అన్నదానానికి సహకరించి సేవాభావాన్ని చాటుకున్న మలోత్ శంకర్‌తారాభాయి దంపతులు





**రఘునాథపాలెం, అక్టోబర్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, ఆధ్యాత్మిక కార్యక్ర6మాలకు సహకరించడం సమాజంలో సేవా స్ఫూర్తిని పెంపొందిస్తాయని చాటిచెప్పారు హర్యాతండా గ్రామానికి చెందిన మలోత్ శంకర్‌తారాభాయి దంపతులు. దేవీ నవరాత్రుల పవిత్ర సందర్భంగా హర్యాతండా గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ దుర్గాదేవి విగ్రహం వద్ద నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమానికి సహకరించిన ఈ దంపతులను గ్రామ ప్రముఖులు ఘనంగా సన్మానించారు.మలోత్ శంకర్‌తారాభాయి దంపతులకు శాలువా కప్పి సత్కరించి, వారి సేవాభావాన్ని అభినందించారు. భక్తులకు అన్నప్రసాదం అందించే పవిత్ర కార్యక్రమానికి తమ వంతు సహకారం అందించడం అభినందనీయమని గ్రామ ప్రముఖులు కొనియాడారు.ఈ కార్యక్రమంలో మలోత్ రాజా నాయక్, ఉపసర్పంచ్ బానోత్ శ్రీను నాయక్, మాజీ సర్పంచ్ మాలోత్ కాంతి, ఫీల్డ్ అసిస్టెంట్ అజ్మీరా శ్రీను, గ్రామ పెద్దలు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# జాతీయ వేదికపై ఈషిత్వ సత్తా.. అంతర్జాతీయ పతకమే లక్ష్యం!

### రైఫిల్ షూటింగ్‌లో పతకాల పంట..

### ఫుట్‌బాల్, ఎన్‌సీసీలోనూ ప్రతిభ

### మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ ఆర్. కృష్ణయ్య అభినందనలు




**హైదరాబాద్, అక్టోబర్ 22 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** వయసు 14 ఏళ్లు.. లక్ష్యం మాత్రం అంతర్జాతీయ వేదికపై భారత జెండాను రెపరెపలాడించడమే. హైదరాబాద్‌కు చెందిన యువ రైఫిల్ షూటర్ తేలు ఈషిత్వ శ్రీకృష్ణ తన ప్రతిభతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోంది. క్రమశిక్షణ, పట్టుదలతో పలు పోటీల్లో పతకాలు సాధిస్తూ ముందుకు సాగుతోంది.**షూటింగ్‌లో పతకాలతో గుర్తింపు**బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న ఈషిత్వ 2023లో రైఫిల్ షూటింగ్ ప్రారంభించింది. 2026లో భారత జట్టు ఎంపిక పోటీలకు అర్హత సాధించింది. న్యూఢిల్లీలో జరిగిన ఎంపిక పోటీల్లో 610.0, 610.9 స్కోర్లు నమోదు చేసింది. భోపాల్‌లో జరిగిన 68వ జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో 603.9 స్కోరు సాధించింది. 12వ తెలంగాణ రాష్ట్ర షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో రెండు రజత పతకాలు గెలుచుకుంది. ఐపీఎస్‌సీ జాతీయ ఛాంపియన్‌షిప్‌లో అండర్-17 వ్యక్తిగత, జట్టు విభాగాల్లో రజత పతకాలు సాధించగా, సీఎం కప్‌లో కాంస్య పతకాన్ని దక్కించుకుంది. పాఠశాల స్థాయి పోటీల్లోనూ స్వర్ణ పతకాలతో ప్రతిభ చాటింది.**ఫుట్‌బాల్, ఎన్‌సీసీలోనూ ముందంజ**షూటింగ్‌తో పాటు తెలంగాణ ఫుట్‌బాల్ జట్టులోనూ ఈషిత్వ రాణిస్తోంది. ఎన్‌సీసీలో సార్జెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ, 'ఏ' సర్టిఫికెట్‌ను ప్రత్యేక ప్రతిభతో పూర్తి చేసింది. 2025లో న్యూఢిల్లీలో నిర్వహించిన థల్ సైనిక్ శిబిరంలో 25 మీటర్ల రైఫిల్ విభాగానికి ఎంపికైంది.**మంత్రి, ఎంపీ అభినందనలు**ఈషిత్వ విజయాలను గుర్తించిన రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆమెను తన నివాసంలో సత్కరించి అభినందించారు. భవిష్యత్ పోటీలకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య కూడా ఆమెను అభినందించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. **అంతర్జాతీయ పతకమే ధ్యేయం** తన కుటుంబం, శిక్షకుల ప్రోత్సాహంతో అంతర్జాతీయ వేదికపై దేశానికి ప్రాతినిధ్యం వహించి పతకం సాధించడమే లక్ష్యమని ఈషిత్వ తెలిపింది. సరైన శిక్షణ, క్రమశిక్షణ ఉంటే మధ్యతరగతి కుటుంబాల బాలికలు సైతం క్రీడల్లో ఉన్నత శిఖరాలను చేరగలరని నిరూపించాలని ఆకాంక్షించింది.



# ఎస్సై నాగరాజుకు కాంగ్రెస్ నాయకుల సన్మానం

**- శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు**



**కల్లూరు, అక్టోబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్)** :కల్లూరు ఎస్సై నాగరాజు యాదవ్‌ను సీనియర్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పసుమర్తి చందర్ రావు, మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ ఆధ్వర్యంలో గురువారం ఎస్సైను శాలువాతో సన్మానించి, స్వీట్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తమను తాము ఎస్సైకు పరిచయం చేసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకుడు ఏనుగు సత్యంబాబు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు మట్ట రామకృష్ణ, యూత్ మండల అధ్యక్షుడు ఆలకుంట నరసింహారావు, పాపబత్తిని నగేష్, పంతులు, రాజబోయిన శ్రీనివాసరావు, కుంచాల గురవయ్య, రామకృష్ణ, తురాబలి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో మహిళలకు ఇచ్చిన హామీలు ఎక్కడ..?

**- బీజేపీ మహిళ మోర్చా మండల అధ్యక్షురాలు మాడిశెట్టి సుష్మిత**



**రామడుగు అక్టోబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్ ):** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో మహిళలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని బీజేపీ మహిళ మోర్చా మండల అధ్యక్షురాలు మాడిశెట్టి సుష్మిత ఒక ప్రకటనలో ప్రశ్నించారు. మహాలక్ష్మి పథకం కింద తెలంగాణ ఆడపడుచులకు నెలకు 2500 ఇస్తాను అన్నారు, సిలిండర్ గ్యాస్ సబ్సిడీ 500 ఇస్తాను అన్నారు, అది దిక్కు లేదు కనీసం నిన్నటి కి నిన్న తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ చీరలు ఇవ్వని పరిస్థితి కాంగ్రెస్ పార్టీది అలాగే రైతులకు 24 గంటల కరంట్ అన్నారు, అది దిక్కు లేదు పరిస్థితి యువత నిరుద్యోగ భృతి 3000 అన్నారు, పేరుకు జెంబో మేనిపెస్టో 35 అంశాలు తో 112 పేజీలతో చెప్పుకోవడానికి కనీసం సిగ్గు లేని పరిస్థితి రానున్న 2029 ఎన్నికలలో తెలంగాణలో కచ్చితంగా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు జరుగుతుంది. ఈనెల ముగింపు సమయంలో మండల కార్యాలయం ముట్టడి చేస్తామని అన్నారు.

# ఘనంగా తెలంగాణ పోరాటయోధులు సాయన్న జయంతి వేడుకలు



**రామడుగు, అక్టోబర్22 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాబిన్ హుడ్ పోరాట యోధులు పండగ సాయన్న అని పలువురు వ్యక్తులు అన్నారు. రామడుగు మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం సదర్ పెద్ద మనిషి రాగం లచ్చన్న ఆధ్వర్యంలో స్థానిక పోచమ్మ చౌరస్తాలో గురువారం పండగ సాయన్నముదిరాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సాయన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేకు కట్ చేసి పంపిణీ చేశారు. నిజాం కాలంలో భూస్వాములు పెత్తందారులు పటేల్లు కర్ణాలు దోపిడీలు ఆగడాల నుంచి రక్షణ కల్పించి ధాన్యాగారాలను కొల్లగొట్టి పేద ప్రజలకు పంచి వారి ఆకలి తీర్చిన విప్లవ వీరుడని కొనియాడారు. పండుగ సాయన్న ముదిరాజ్ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు ఉత్తం రాయమల్లు, జిట్టవేణి అంజిబాబు, రాగం వెంకటి, ఈగ రాజేశం, మామిడి తిరుపతి, జిట్టవేణి రమేష్, మామిడి రాజు,ఉత్తేము కనుకయ్య మామిడి సుదర్శన్, సామంతుల మునీందర్, పెసరి రాజమౌళి, బసరవేణి లక్ష్మణ్, మామిడి తిరుపతి, రాగం సతీష్, మామిడి సాయితేజ, మన్నే మధు,బోయిని తిరుపతి, మామిడి అంజి, ఉత్తేము కుమార్ వార్డు సభ్యులు మామిడి శ్రావణ్ కుమార్,సామంతుల సుజాత తిరుపతి నీలం అరుణ లక్ష్మణ్ కారుపాకల నరేష్ పాల్గొన్నారు.

# తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

**● మాజీ మంత్రి కేటీఆర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ఉప్పల్ అక్టోబర్ 23(పి సి డబ్ల్యూ న్యూస్):**రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశానికి ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఉప్పల్ నియోజకవర్గానికి సంబంధించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాలు, పార్టీ బలోపేతం, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై నాయకులు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆటో డ్రైవర్ ఇంట వెలిగిన వైద్య విద్యా దీపం!

**- పేదరికాన్ని అధిగమించి డాక్టర్ సీటు సాధించిన హుస్సేన్ జాఫర్**

**- నీట్-2026లో 468 మార్కులతో ప్రతిభ.. ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో కన్వీనర్ కోటాలో సీటు**

**- విద్యార్థిని ఘనంగా సన్మానించిన ఎంపీజే ఖమ్మం జిల్లా బృందం**




**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఒకవైపు కుటుంబాన్ని పోషించేందుకు ఆటో నడిపే తండ్రి కష్టం.. మరోవైపు పేదరికాన్ని జయించి వైద్యుడిగా ఎదగాలనే కుమారుడి కల.. ఆ కలను నిజం చేసుకునేందుకు చేసిన నిరంతర శ్రమ.. వెరసి ఓ సామాన్య కుటుంబంలో అసాధారణ విజయానికి నాంది పలికింది. ఆర్థిక ఇబ్బందులు ఆశయానికి అడ్డుకాదని నిరూపిస్తూ చింతకాని మండలం నేరడ గ్రామానికి చెందిన ఎస్.కె. హుస్సేన్ జాఫర్ వైద్య విద్యలో సీటు సాధించి అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. హుస్సేన్ జాఫర్ నీట్-2026లో 468 మార్కులు సాధించి ఆల్ ఇండియా స్థాయిలో 16,793వ ర్యాంకు, తెలంగాణ రాష్ట్ర స్థాయిలో 2,407వ ర్యాంకు సాధించాడు. ఈ ప్రతిభతో ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో కన్వీనర్ కోటాలో వైద్య విద్యను అభ్యసించే అవకాశం దక్కించుకున్నాడు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించే తండ్రి ఎస్.కె. మదార్ సాహెబ్‌కు, తన చదువుతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలలు కన్న కుటుంబ సభ్యులకు ఈ విజయం ఎనలేని ఆనందాన్ని అందించింది. సామాన్య కుటుంబంలో పుట్టి, పరిమిత వనరుల మధ్య చదువును కొనసాగిస్తూ వైద్య విద్యలో ప్రవేశం పొందడం చిన్న విషయం కాదు. వైద్య విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో కష్టపడి చదివిన జాఫర్ విజయం ఎంతోమంది పేద విద్యార్థులకు స్ఫూర్తిదాయకం. తండ్రి చెమట చుక్కల్లో తన భవిష్యత్తును చూసుకుంటూ, కుటుంబ ఆశలను తన లక్ష్యంగా మలుచుకున్న ఈ యువకుడి సాధన అభినందనీయం. ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా పట్టుదల, క్రమశిక్షణ, కృషి ఉంటే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని జాఫర్ నిరూపించాడు.వైద్య విద్యలో సీటు సాధించడం ఒక వ్యక్తి విజయమే కాదు.. తన కుటుంబం ఎన్నో ఏళ్లుగా మోస్తున్న ఆశలకు దక్కిన ప్రతిఫలం. ఆటో నడిపే తండ్రి కష్టానికి దక్కిన గౌరవం.. నేరడ గ్రామానికి లభించిన గర్వకారణం.. పేద విద్యార్థుల కలలకు కొత్త ధైర్యాన్నిచ్చే స్ఫూర్తి. భవిష్యత్తులో మంచి వైద్యుడిగా ఎదిగి, పేదలకు నాణ్యమైన వైద్య సేవలందిస్తూ తన తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు. హుస్సేన్ జాఫర్ సాధించిన విజయంపై ముమ్మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) ఖమ్మం జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీజే కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాసిం అధ్యక్షతన గురువారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో జాఫర్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. పేదరికాన్ని చూసి వెనకడుగు వేయకుండా లక్ష్యసాధన దిశగా ముందుకు సాగిన జాఫర్ యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. వైద్య విద్యను విజయవంతంగా పూర్తిచేసి సమాజానికి, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు సేవలందించే ఉత్తమ వైద్యుడిగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే జిల్లా ప్రధాన కార్యదర్శి నాసర్ అహ్మద్, కోశాధికారి ఎం.డి. హకీమ్, కార్యదర్శులు బి. సతీష్, రఫీ, సభ్యులు ఖుర్షీద్, హుస్సేన్ మియా, షరీఫ్, సువాన్ పాషా, మహమూద్, జమాతే ఇస్లామీ హింద్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఖలీల్ అహ్మద్, సేవా బ్యాంక్ మేనేజర్ ఎం.డి. మొయినుద్దీన్, ఎంపీజే సభ్యులు మునీర్, జానీ, మియా అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రజల హక్కుల కోసం పోరాడిన వీరుడు పండుగ సాయన్న

**టీడీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా ముదిరాజ్ జయంతి వేడుకలు**

**అణచివేతకు ఎదురొడ్డి నిలిచిన సాయన్న ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి: కేతినేని హరీష్ చంద్ర**



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 22 (పీసీడబ్ల్యూ న్యూస్):** పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన తెలంగాణ ప్రజా వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. అన్యాయాన్ని ఎదిరించి సామాన్య ప్రజల పక్షాన నిలిచిన ఆయన పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. పండుగ సాయన్న ముదిరాజ్ జయంతిని పురస్కరించుకుని గురువారం ఖమ్మంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు బోయిన వెంకన్న ముదిరాజ్ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఖమ్మం పార్లమెంట్ హక్కుల కమిటీ సభ్యుడు కేతినేని హరీష్ చంద్ర మాట్లాడుతూ, పెత్తందారులు, భూస్వాములు, జమీందారీ వ్యవస్థతో పాటు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పండుగ సాయన్న పోరాడారని తెలిపారు. ప్రజలపై జరిగే అణచివేతను ఎదిరించి, సామాన్యుల పక్షాన నిలిచిన వీరుడిగా ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు.

ప్రజలు ఆయనను రాబిన్‌హుడ్‌గా కూడా గుర్తు చేసుకుంటారని అన్నారు. నేటి సమాజంలోనూ బలహీన వర్గాల గొంతుకగా నిలవాల్సిన అవసరం ఉందని నాయకులు అభిప్రాయపడ్డారు. అన్యాయాన్ని ప్రశ్నించడం, బాధితులకు అండగా నిలవడం, సమానత్వం కోసం కృషి చేయడం వంటి విలువలను పండుగ సాయన్న జీవితం నేర్పుతుందని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను మాటల్లోనే కాకుండా, పేదలకు సహాయం చేయడం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడం, యువతలో సేవాభావం, సామాజిక బాధ్యతను పెంపొందించడం ద్వారా నిజమైన నివాళి అర్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కాశబోయిన అనంత రాములు, పిట్టల నాగేశ్వరరావు, మావిడి వెంకటేశ్వర్లు, కూచిపూడి జై, తాడిశెట్టి ఉపేందర్, కర్నాటి సీతారాములు, నాగండ్ల లక్ష్మణ్, బాబు పాల్గొన్నారు.

# చైర్మన్ పదవి ఖమ్మం జిల్లాకి ఇవ్వాలి

**- ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు పసుమర్తి చందర్ రావు**



**కల్లూరు, అక్టోబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్)** :ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఖమ్మం జిల్లా వాసికి ఇవ్వాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు పసుమర్తి చందర్ రావు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కు ను కోరారు. మధిర నియోజకవర్గ శాసనసభ్యులు,తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖా మాత్యులు, ఉప ముఖ్యమంత్రివర్యులు భట్టి విక్రమార్క మధిర శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయానికి విచ్చేసిన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా ఆహ్వానించి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి వర్యులు భట్టి విక్రమార్క అమ్మవారిని దర్శించుకొని, జమ్మి చెట్టు దగ్గర పూజలు నిర్వహించి విచ్చేసిన భక్తులందరికీ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య నాయకులు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఖమ్మం జిల్లాలోని ఆర్యవైశ్యులకు కేటాయించాలని ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు, గౌరవాధ్యక్షులు వనమా వేణుగోపాలరావు, జిల్లా ఆర్యవైశ్య రాజకీయ విభాగం చైర్మన్ రంగా హనుమంతరావు, మండలాధ్యక్షులు చారుగుండ్ల నరసింహామూర్తి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి కాజా చక్రధర్ రావు, ఆలయ కమిటీ అధ్యక్షులు పల్లపోతు ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి కుంచం కృష్ణారావు వాసవి ఆర్యవైశ్య కళ్యాణమండపం అధ్యక్షులు కురువెళ్ళ కృష్ణ, ప్రధాన కార్యదర్శి నాళ్ళా శ్రీనివాసరావు తదితర ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో వివక్షపై విపక్షాల ఆగ్రహం

**"కండువా కప్పుకుంటేనే అర్హులా?"**

**గ్రామ కమిటీలను రద్దు చేసి లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేయాలి**

**ఖమ్మం కలెక్టరేట్ ఎదుట వామపక్షాలు, బీఆర్ఎస్ ధర్నా**









**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 22 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ వివక్ష చూపుతున్నారని ఆరోపిస్తూ వామపక్షాలు, బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేయకుండా అధికార పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ పాలన సాగుతోందని మండిపడ్డారు. రాజకీయ వివక్షను విడనాడి, నిజమైన అర్హులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. గురువారం ఖమ్మం ధర్నాచౌక్‌లో ఎమ్మెల్సీ తాతా మధు అధ్యక్షతన సీపీఐ, సీపీఎం, బీఆర్ఎస్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తదితర పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ గేటు ఎదుట సుమారు గంటపాటు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన పేదలకు ఇళ్లు దక్కడం లేదని ఆరోపించారు. ఎల్-1, ఎల్-2 ప్రాధాన్యతా క్రమంతో పాటు ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి అధికార పార్టీకి చెందిన వారికి ఇళ్లు కేటాయిస్తున్నారని విమర్శించారు. మంత్రులు ఇళ్ల కేటాయింపులో వివక్ష లేదని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని పేర్కొన్నారు. అధికార యంత్రాంగం కూడా అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి, క్యాంపు కార్యాలయాల్లో లబ్ధిదారుల ఎంపిక చేపడుతోందని ఆరోపించారు.

**ప్రజాధనంపై అందరికీ హక్కు**

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి వెచ్చిస్తున్న నిధులు కాంగ్రెస్ పార్టీకి లేదా మంత్రులకు చెందినవి కావని, అవి ప్రజల సొమ్మని నాయకులు స్పష్టం చేశారు. పన్నులు చెల్లిస్తున్నది కాంగ్రెస్ కార్యకర్తలేనా, ఇతరులు పన్నులు చెల్లించడం లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కండువా కప్పుకున్న వారికే ఇళ్లు కేటాయించడం సమంజసం కాదని అన్నారు. రాజ్యాంగంలోని 73, 74వ సవరణల స్ఫూర్తికి విరుద్ధంగా గ్రామస్థాయి ప్రజాప్రతినిధులకు లబ్ధిదారుల ఎంపికలో తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని విమర్శించారు. బోనకల్లు, కల్లూరు మండలం మర్లపాడు ప్రాంతాల్లో చోటుచేసుకున్న పరిణామాలు రాజకీయ వివక్షకు ఉదాహరణలని నాయకులు ఆరోపించారు. గతంలో అర్హులైన పేదలను గుర్తించి లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసేవారని, ప్రస్తుతం ఆ విధానం అమలుకావడం లేదని అన్నారు.

**కలెక్టర్‌కు వినతిపత్రం**

ఇందిరమ్మ గ్రామ కమిటీలను తక్షణమే రద్దు చేయాలని, అర్హులను పారదర్శకంగా గుర్తించి లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. జిల్లాలో ఇళ్ల కేటాయింపులో అర్హులకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. జిల్లా నలుమూలల నుంచి వామపక్షాలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, ఎమ్మెల్సీ తాతా మధు, సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోత్ చంద్రావతి, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సీవై పుల్లయ్య, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బండారు ఐలయ్య, సీపీఐ(ఎంఎల్) నాయకుడు చంద్ర సురేందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మహ్మద్ మౌలానా, బెల్లం వేణుగోపాల్, బండి రమేష్, మాదినేని జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఎస్కే జానిమియా, ఏపూరి లతాదేవి, ఆవుల అశోక్, జి. రామయ్య, శిరోవ లక్ష్మీ నారాయణ, యర్రా శ్రీనివాసరావు, పగడాల నాగరాజు, బొమ్మెర రామ్మూర్తి, పలువురు గ్రామ సర్పంచులు, కౌన్సిలర్లు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## వి. వెంకటాయపాలెంలో ఎస్.ఆర్ శంకరన్ జయంతి, స్వేరోస్ డే వేడుకలు



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లా, రఘునాదపాలెం మండలం, వి. వెంకటాయపాలెం గ్రామంలో ఎస్.ఆర్ శంకరన్ జయంతి, స్వేరోస్ డే వేడుకలను చిన్నారుల మధ్య గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఆర్ శంకరన్ ఆశయాలను స్మరించుకుంటూ, విద్య, సమానత్వం, సామాజిక న్యాయం ప్రాముఖ్యతను వివరించారు. చిన్నారుల్లో విద్య పట్ల ఆసక్తిని పెంపొందిస్తూ, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ ఆర్గనైజేషన్ మాజీ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ స్వేరో, వెంకటేష్ స్వేరో, రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు. భవిష్యత్తు స్వేరో చిన్నారుల సమక్షంలో వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. విద్యతోనే వికాసం.. సమానత్వంతోనే సమాజాభివృద్ధి! అనే సందేశంతో ఈ వేడుకలు ఆదర్శప్రాయంగా నిలిచాయి.

## విద్యతో పాటు ఆటల్లోను రాణించాలి

**- మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి**

**- జూనియర్ బాలికల జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ**



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** విద్యతో పాటు ఆటల్లోను రాణించాలని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 31 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్న 48వ జూనియర్ బాలికల జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్2026 పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా పోస్టర్ ను మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు భీమనాదుల అశోక్ రెడ్డి, సెక్రటరీ వరికూటి మోహన్, కోశాధికారి కోపిల తంబి, చీఫ్ ప్యాట్రన్ వేముల ఆది, నాయకులు లింగాల రవికుమార్, కాంగ్రెస్ పార్టీ తిరుమలాయపాలెం మండల అధ్యక్షులు కొప్పుల అశోక్, నాయకులు యువ గోపి, సంఘం ప్రతినిధులు, క్రీడా నిర్వాహకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు నమోదు ప్రక్రియ వేగం పెంచాలి

**మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య**





**వేంసూరు, అక్టోబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండలంలో ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియ వేగం పెంచాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సూచించారు. వేంసూరు మండల ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులతో కందుకూరు లోని ఉప సర్పంచ్ గొర్ల ప్రభాకర్ రెడ్డి నివాసంలో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన పట్టభద్రులను గుర్తించి, మండలవ్యాప్తంగా కొత్త ఓటరు నమోదులు పెద్ద సంఖ్యలో జరిగేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సండ్ర వెంకటవీరయ్య అన్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటరు నమోదుపై అవగాహన కల్పించి, నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. కొత్త పాత పట్టభద్రుల ఆన్ లైన్ నమోదు తప్పనిసరి అని అవగాహన కలిగిన వాళ్లు వాళ్ల మొబైల్ లో ఆన్లైన్ చేసుకోవచ్చు అని అలాకాకుండా ఎవరికైనా ఆన్లైన్ ఇబ్బందులు ఉంటే బీఆర్ఎస్ పార్టీ ఏర్పడేసిన ఆన్లైన్ కేంద్రాల్లో చేయించే విధంగా చూడాలని ఎప్పటికప్పుడు పర్సంటేజ్ పరిశీలించి ఆన్లైన్ విధానం పైనే దృష్టి చాలించారని అన్నారు. మండలంలో ఇప్పటివరకు 50 శాతం నమోదయిందని నవంబర్ 6 లోపు పూర్తిస్థాయిలో నమోదు కార్యక్రమాలు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు పాలా వెంకటరెడ్డి, కంటే వెంకటేశ్వరావు, మాజీ ఎంపీపీ పగుట్ల వరంకటేశ్వరావు, దొడ్డ వెంకట కృష్ణారెడ్డి, దొడ్డ చెన్నకేశవరెడ్డి, కాటేజమలరావు, పోతురాజు చక్రధర్, గాదె శ్రీనివాస్, పుచ్చకాయల శంకర్ రెడ్డి, గొర్ల సత్యనారాయణ రెడ్డి, కోటమర్తి బాలస్వామి, రావూరి శ్రీనివాసరావు, కిన్నెర రత్నకుమార్, గుండాల వెంకటేశ్వరరావు, బండి ఉపేందర్ రెడ్డి, కుక్క పల్లి సుధాకర్, కుక్క పల్లి కిరణ్, మోరంపూడి శ్రీధర్ బాబు, నున్నా రాంబాబు, గొర్ల శ్రీనివాసరెడ్డి, జుంజునూరి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## కార్మికుల ఆనందమే మా కుటుంబానికి పండుగ

**- విజయదశమి కానుకగా నూతన వస్త్రాల పంపిణీ**





**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 22 (పీసీడబ్ల్యూ న్యూస్):** కార్మికుల ముఖాల్లో చిరునవ్వులే తమ కుటుంబానికి నిజమైన పండుగ అని 48వ డివిజన్ మాజీ కార్పొరేటర్ తోట గోవిందమ్మ, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు తోట రామారావు దంపతులు అన్నారు. విజయదశమి సందర్భంగా బుధవారం తమ కుమారులు తోట రమేష్, డాక్టర్ తోట లక్ష్మణ్‌తో కలిసి ఖమ్మంలోని 48వ డివిజన్‌లో కేఎంసీ సిబ్బందికి, కూరగాయల మార్కెట్ కార్మికులకు, టీఆర్ఆర్ ఆర్థో యాక్సిడెంట్ కేర్ ఆసుపత్రి సిబ్బందికి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోట రామారావు మాట్లాడుతూ, నిత్యం ప్రజలకు సేవలందించే కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని, వారి పండుగ సంతోషాల్లో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం వస్త్రాలు అందిస్తున్నామని తెలిపారు. కార్మికుల కుటుంబాల్లో సంతోషం చూడటం తమకు ఎంతో సంతృప్తినిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తోట రమేష్, డాక్టర్ తోట లక్ష్మణ్, వెంకట్, చేతి కృష్ణ, కిషన్ నాయక్, బాబా, కునుపూరి మహేష్, రవీందర్, ఆకుల సత్యం, నవీన్, మేచినేని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# విజయదశమి పర్వదినాన మహిళలందరూ సంతోషంగా ఉండాలి

**- 48వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లె సాయికిరణ్**

**- 48వ డివిజన్ ప్రజలకు విజయదశమి కానుకగా పట్టుచీరల పంపిణీ**



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 22 (పిసిడబ్ల్యూ న్యూస్) :** విజయదశమి పర్వదినాన మహిళలందరూ సంతోషంగా ఉండాలని 48వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లె సాయికిరణ్ అన్నారు. విజయదశమి పండుగను పురస్కరించుకొని బుధవారం ఖమ్మం నగరంలోని 48వ డివిజన్ పరిధిలో గణేష్ నగర్, వెంకటేశ్వర నగర్, పద్మావతి నగర్, సారధి నగర్ ప్రాంతాల ప్రజలకు కాంగ్రెస్ 48వ డివిజన్ అధ్యక్షుడు అల్లే సాయి కిరణ్, రూపాదేవి దంపతులు పట్టుచీరలను పంపిణీ చేశారు. ఆయా ప్రాంతాల్లోని ప్రతి ఇంటిలో ఒక్కొక్కరికి ఒక పట్టుచీర అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అల్లే సాయికిరణ్, రూపాదేవి దంపతులు మాట్లాడుతూ.. విజయదశమి పర్వదినం సందర్భంగా తమ డివిజన్ ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆయా గృహాలలోని మహిళలకు పట్టుచీరలు పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. పండుగ వేళ ప్రజలతో ఆనందాన్ని పంచుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. విజయదశమి పండుగను ప్రజలందరూ అత్యంత ఉత్సాహంగా, సంతోషంగా జరుపుకోవాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని వారు ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు బోజట్ల సత్యనారాయణతో పాటు కాంగ్రెస్ డివిజన్ నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.



# పెళ్లి పీటలెక్కనున్న ‘హనుమాన్’ హీరో..

## తేజ సజ్జా వివాహ ముహూర్తం ఫిక్స్!



టాలీవుడ్ యువ హీరో తేజ సజ్జా త్వరలో పెళ్లి చేసుకోబోతున్నాడు. డిసెంబర్‌లో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో తన వివాహం జరగనున్నట్లు వెల్లడించాడు. నవంబర్‌లో నిశ్చితార్థం నిర్వహించి, ఆ తర్వాతి నెలలో పెళ్లి వేడుక జరగనుంది. తనది పెద్దలు కుదిర్చిన వివాహమని, తల్లిదండ్రులే సంబంధం ఖరారు చేశారని తేజ తెలిపాడు.

తన వ్యక్తిగత జీవితాన్ని ఎప్పుడూ గోప్యంగా ఉంచే తేజ.. పెళ్లి వేడుకను కూడా నిరాడంబరంగా నిర్వహించాలని నిర్ణయించుకున్నాడు. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే ఈ వేడుకకు హాజరుకానున్నారు. ఉదయ్‌పూర్‌లో వివాహం అనంతరం హైదరాబాద్‌లో రిసెప్షన్ నిర్వహించనున్నారు.

తనకు కాబోయే భార్య కుటుంబానికి సినీ పరిశ్రమతో ఎలాంటి సంబంధాలు లేవని తేజ వెల్లడించాడు. వారు టెక్నాలజీ రంగంలో ఉన్నారని, ఆమె ప్రస్తుతం తన తండ్రితో కలిసి పనిచేస్తోందని చెప్పాడు. అమెరికాలో పెరిగిన ఆమెకు సినీ ప్రముఖుల ప్రపంచం, ప్రచార హడావుడి గురించి పెద్దగా పరిచయం లేదని తెలిపాడు. ఆ విషయం తనకు బాగా నచ్చిందని, పెళ్లి తర్వాత కూడా ఆమె వ్యక్తిగత జీవితానికి గోప్యత ఉండేలా చూసుకోవాలనుకుంటున్నట్లు పేర్కొన్నాడు.

తనకు కాబోయే భార్య వివరాలను మాత్రం తేజ వెల్లడించలేదు. ఆమె వ్యక్తిగత గోప్యతను కాపాడాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

‘హనుమాన్’ సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న తేజ సజ్జా.. ఆ తర్వాత ‘మిరాయ్’తోనూ ప్రేక్షకులను అలరించాడు. సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ వ్యక్తిగత జీవితాన్ని మాత్రం కెరీర్‌కు దూరంగా ఉంచుతున్నాడు. ప్రస్తుతం ఆయన ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతున్న ‘ది ట్రైటర్స్ తెలుగు’ తొలి సీజన్‌కు హోస్ట్‌గా వ్యవహరిస్తున్నాడు.

# వెంకటేశ్ కోసం ‘ఏమో ఏమో ఇది’ వాయిదా.. కొత్త రిలీజ్ డేట్ త్వరలో!

టాలీవుడ్‌లో మరో సినిమా విడుదల వాయిదా పడింది. ప్రీతి ముకుందన్, రోషన్ మేకా జంటగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ చిత్రం ‘ఏమో ఏమో ఇది’ విడుదల తేదీ మారింది. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. అయితే, అదే రోజున వెంకటేశ్ నటించిన ‘ఆదర్శ కుటుంబం హౌస్ నంబర్: 47’ విడుదల కానుండటంతో ‘ఏమో ఏమో ఇది’ చిత్రబృందం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని దర్శకుడు శైలేష్ కొలను సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. నటుడు వెంకటేశ్ తమ అందరి హృదయాల్లో ప్రత్యేక స్థానం కలిగి ఉన్నారని పేర్కొన్నారు. ఆయన నటించిన ‘ఆదర్శ కుటుంబం’ అక్టోబర్ 30న విడుదలవుతున్న నేపథ్యంలో తమ సినిమా కొత్త తేదీన ప్రేక్షకుల ముందుకు వస్తుందని తెలిపారు. కొత్త విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. అప్పటివరకు సినిమా పాటలను ఆస్వాదించాలని అభిమానులను కోరారు. మరిన్ని మధురమైన పాటలు రానున్నాయని వెల్లడించారు. శైలేష్ కొలను ప్రకటనపై ‘ఆదర్శ కుటుంబం’ కథానాయిక శ్రీనిధి శెట్టి స్పందించారు. ‘ఏమో ఏమో ఇది’ చిత్రబృందానికి ప్రేమాభిమానాలు తెలియజేస్తూ, సినిమా కోసం ఎదురుచూస్తున్నానని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. మరోవైపు, వెంకటేశ్, శ్రీనిధి శెట్టి జంటగా నటిస్తున్న ‘ఆదర్శ కుటుంబం హౌస్ నంబర్: 47’ చిత్రానికి త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను తొలుత అక్టోబర్ 2న విడుదల చేయాలని భావించారు. ఆ తర్వాత అక్టోబర్ 9కి వాయిదా వేశారు. తాజాగా అక్టోబర్ 30న విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ ప్రకటించింది.




# ఇమాన్వి లేటెస్ట్ లుక్.. గ్లామర్ డోస్ అదుర్స్!

సోషల్ మీడియా రీల్స్‌తో కుర్రకారును విపరీతంగా ఆకట్టుకుని విపరీతమైన ఫాలోయింగ్ సంపాదించుకున్న బ్యూటీ ఇమాన్వి ఇస్మాయిల్ ఇప్పుడు మరోసారి ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. ఎలాంటి సినిమా బ్యాక్‌గ్రౌండ్ లేకుండా కేవలం తన అద్భుతమైన డాన్స్ మూవ్స్, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో నేషనల్ వైడ్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ.. తాజాగా షేర్ చేసిన ఫోటోషూట్ పిక్స్ సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తున్నాయి. ఆ లేటెస్ట్ లుక్ విశేషాలు ఇప్పుడు చూద్దాం..ట్రెండీ ఆరెంజ్ డ్రెస్‌లో క్యూట్ లుక్స్: ఇమాన్వి తాజాగా పోస్ట్ చేసిన ఫోటోల్లో తనదైన స్టైల్‌లో ఫ్యాషన్ ప్రియులను ఫిదా చేశారు. ఈ లేటెస్ట్ ఫోటోషూట్‌లో ఆమె బ్రైట్ ఆరెంజ్ కలర్ స్లీవ్‌లెస్ డ్రెస్‌లో మెరిసిపోయారు. స్క్వేర్ నెక్ లైన్ మరియు ఫ్లేర్డ్ స్కర్ట్ ఉన్న ఈ డిజైనర్ డ్రెస్‌లో ఆమె ప్రిన్సెస్ లాగా అందంగా కనిపిస్తున్నారు. ఇక తన డ్రెస్‌కు మ్యాచింగ్‌గా తలలో పెట్టుకున్న వైట్ బో, చెవులకు గోల్డ్ హూప్ రింగ్స్ ఆమె అందాన్ని మరింత పెంచాయి.ాశ్రీంశీ =ముు - ప్యారడైజ్ మార్పులు పని చేశాయా?ాసజవతీఅంవఎవత్ సింపుల్ యాక్సెసరీస్.. నాచురల్ మేకప్: ఈ ట్రెండీ లుక్‌కు తగ్గట్టుగానే ఇమాన్వి జ్యువెల్లరీని చాలా సింపుల్‌గా మెయింటైన్ చేశారు. మెడలో ఒక సన్నని లేయర్డ్ నెక్లెస్, చేతికి ఒక డెలికేట్ బ్రాస్‌లెట్, ఉంగరం ధరించి పర్ఫెక్ట్ లుక్‌ను క్రియేట్ చేశారు. జుట్టును వదులుగా విరుచుకుని, ముఖానికి సాఫ్ట్ అండ్ నాచురల్ మేకప్‌తో ఆమె మరింత గ్లామరస్‌గా కనిపిస్తున్నారు. ఇక ఈ ఫోటోల్లో ఆమె ఎక్స్‌ప్రెషన్స్ చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు.





# చొక్కా నలగకుండా రూ.500 కోట్లు కొట్టడం రజనీకే సాధ్యం..

## ‘జైలర్ 2’పై అల్లు అర్జున్ ప్రశంసలు





సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన ‘జైలర్ 2’ సినిమాపై టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రశంసలు కురిపించాడు. రజనీకాంత్ స్టార్‌డమ్, స్టైల్, ఆరా ఈ సినిమాలో అద్భుతంగా కనిపించాయని కొనియాడాడు. ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచే కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా సినిమా ఆకట్టుకుందని పేర్కొన్నాడు. ఈ సందర్భంగా చిత్రబృందానికి అభినందనలు తెలిపాడు.

ఈ మేరకు అల్లు అర్జున్ ఎక్స్ వేదికగా స్పందించాడు. “రజనీ సార్ స్టార్‌డమ్, స్వాగ్, ఆరాకు ‘జైలర్ 2’ నిజమైన నిదర్శనం. సినిమా ఆద్యంతం ఉత్కంఠను కొనసాగించే కమర్షియల్ ఎంటర్‌టైనర్. అనిరుధ్ అదరగొట్టాడు. నటీనటులు, సాంకేతిక నిపుణులు, నిర్మాత ఈ సినిమా కోసం తమ హృదయాలను పెట్టి పనిచేశారు. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ అద్భుతమైన హిట్ అందించాడు. చొక్కా నలగకుండా రూ.500 కోట్లకు పైగా వసూళ్లు సాధించడం ఒక్క రజనీగారికే సాధ్యం” అని ప్రశంసించాడు.

‘జైలర్ 2’ ప్రపంచవ్యాప్తంగా రూ.500 కోట్ల వసూళ్ల మార్కును దాటడంతో పలువురు సినీ ప్రముఖులు ఇప్పటికే చిత్రబృందాన్ని అభినందించారు. బాలీవుడ్ నటుడు రితేశ్ దేశ్‌ముఖ్ సినిమా చూసిన తర్వాత స్పందిస్తూ.. రజనీకాంత్ ఆరా మరో స్థాయిలో ఉందని అన్నాడు. థియేటర్‌లో ప్రతి ఎంట్రీకి చప్పట్లు కొడుతూ, ఈలలు వేస్తూ సినిమాను ఆస్వాదించానని తెలిపాడు.

ప్రముఖ నటుడు కమల్ హాసన్ కూడా తన స్నేహితుడు రజనీకాంత్‌కు అభినందనలు తెలిపాడు. సినిమా ప్రపంచవ్యాప్తంగా సూపర్‌హిట్‌గా నిలిచిందన్న వార్త సంతోషాన్ని కలిగించిందని పేర్కొంటూ దర్శకుడు నెల్సన్, సంగీత దర్శకుడు అనిరుధ్, సన్ పిక్చర్స్ బృందానికి శుభాకాంక్షలు చెప్పాడు.

జాతీయ అవార్డు గ్రహీత ధనుష్ తొలి రోజు తొలి ఆట చూసిన అనంతరం ‘జైలర్ 2’ తప్పక చూడాల్సిన సినిమా అని ప్రశంసించాడు. ప్రతి తలైవర్ అభిమానికీ ఇది గొప్ప విందు అని పేర్కొన్నాడు. దర్శకులు లింగుస్వామి, వెంకట్ ప్రభు, కార్తీక్ సుబ్బరాజ్ తదితరులు కూడా రజనీకాంత్ నటనను, నెల్సన్ దర్శకత్వాన్ని, అనిరుధ్ సంగీతాన్ని కొనియాడారు.